# కథ

బి.జి.ఎస్. రావ్.



ఆదివారం... ఉదయం ఏడు కూడా కాలేదు. ఎవరో కాలింగ్ బెల్ నొక్కారు. పాణికి చాలా చిరాకు వేసింది. అతగాడు ఉదయం ఎనిమిదిన్నర, తొమ్మిది గంటలకు కానీ మంచం మీద నుంచి ఆదివారంనాడు దిగడు. మిగిలిన ఆరు రోజులు కనీసం పదిహేను గంటలు పని చేస్తాడు. ఇంచుమించు ఓ గంటన్నర సేపు రచనా వ్యాసంగానికి కేటాయిస్తాడు. ప్రతి రోజూ నాలుగు గంటలైనా పత్రికలు, పేపర్లు చదువుతాడు. ఇంక ఆఫీసు పని ఎలాగూ తప్పదు. ఆదివారం మటుకు పూర్తిగా విశ్రాంతి. అటువంటిది మరి ఈ రోజు ఏడు కూడా కాకుండా ఎవరో, ఎక్కడ్నుంచో, ఎందుకో రావటం అతనికి సహజంగానే చిరాకు వేసింది. కానీ తప్పదు కదా! తలుపు తీసిన పాణికి ఆమె ముకుళిత హస్తాలతో నమస్కరించింది.

"మీరు....?"

"నా పేరు వందన. మీరేనా పాణి గారు?"

అతగాడి మౌనాన్ని ఆమె అంగీకారంగా తీసుకుంది. "ఇటీవల పత్రికలో మీ కథ చూశాను. చదివాను. ఆ తరువాత మా అన్నయ్యను మీ కథ చదవమన్నాను. అంతే - మిమ్మల్ని అభినందించాలని అనిపించింది. మీ దగ్గరికి ఎంతో దూరం నుంచి వచ్చాను."

ఆమె కళ్లల్లో, ఆమె మొహంలో అతగాడికి అంతులేని ఆనందం, కనిపించింది ఆమెని లోపలికి రమ్మనమని, ఇంకో అయిదు నిముషాల్లో ఆమె కోసం కాఫీ కలిపి తీసుకొచ్చాడు పాణి.

"నా కథ మీకు అంతగా నచ్చడానికి కారణం?"

"మీ కథ - ఓ కాపురాన్ని నిలబెట్టింది. నిలువుగా చీలిపోయిన ఓ నిండు సంసారాన్ని తిరిగి సరిదిద్దింది. మీకు-ఇదే నా చిరుకానుక" అంటూ వందన పాణి చేతికి ఓ పేకెట్ అందచేసింది. అందులో ఓ పెన్ సెట్, రైటింగ్ పేడ్ ఉన్నాయి.


"మీరు ఇంతకుముందు నా రచన లేమన్నా చదివారా?"

"నేను ఒకే ఒక కథ చదివాను. ఇంతకు ముందరే చెప్పానుగా. ఆ కథ చదివాక కానీ మీ రెవరో నాకు తెలియదు. అంతకు ముందర మీ పేరు వినలేదు. పత్రిక ఆఫీసుకి ఫోన్ చేసి మీ ఎడ్రస్ తెలుసుకుని మీ దగ్గరకు వచ్చాను. ఇంచుమించు ఓ వారం నుంచి మీ దగ్గరకు రావాలని ప్రయత్నం, తాపత్రయం. చివరికి ఈ రోజు మీ దర్శనభాగ్యం కలిగింది."

"సరే, నే నింకో పదిహేను నిముషాలలో బ్రష్ చేసుకుని వస్తాను. ఈ లోపుగా మీరు ఈ ఫైల్ చూస్తూ ఉండండి. ఇందులో నా రచనల జిరాక్స్ కాపీలన్నీ ఉన్నాయి."

పాణి బ్రష్ చేసుకుంటున్నాడు కానీ, అతని మనసు నిండా ఆలోచనలే. ఇప్పుడు అతగాడి చిరాకు అంతా మటుమాయం అయింది. ఎవరో అజ్ఞాత యువతి తన కథ చదివి, తన కోసం వచ్చింది. మనస్ఫూర్తిగా తనని అభినందించింది. ఎంతో దూరం నుంచి తనని వెతుక్కుంటూ వచ్చింది. ఆ క్షణంలో అతగాడికి తన జన్మ చరితార్థమైనట్లు అనిపించింది. బ్రష్ చేసుకున్నాక, సబ్బుతో మొహం రుద్దుకుని, పౌడర్ రాసుకోవాలనిపించింది. సరే... ఈ తతంగమంతా పూర్తయ్యాక తన కోసం ఓ కప్పు కాఫీ కలుపుకుని డ్రాయింగ్ రూమ్‌కి వెళ్లాడు.

"ఇప్పుడు చెప్పండి. ఎలా ఉన్నాయి నా రచనలు?" అతగాడి కళ్లల్లో ఆమె ఏం చెప్తుందో వినాలనే




కుతూహలం, ఆరాటం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఏదీ ఇప్పుడేగా మీరు ఈ ఫైల్ ఇచ్చింది! కనీసం నాలు గయిదు కథలయినా చదవకపోతే మీ రెలాంటి రచయితో చెప్పటం కష్టం."

తీరా ఆ సమయ మొచ్చాక మిగిలిన ఎన్నికల ఫలితాలతోపాటు తను పోటీ చేసిన నియోజకవర్గంలో ఏవో కారణాల వల్ల ఫలితం ప్రకటించకపోతే, ఆ అభ్యర్థికి ఎలా ఉంటుందో పాణికి అచ్చంగా అలాగే అనిపించింది. కానీ, తనేం చెయ్యగలడు? రచనలు చేయటం వరకే తన వంతు. తర్వాత వాటిని చదివి అందులోని మంచి చెడులని పరిశీలించి, నిర్ణయాన్ని ప్రకటించే హక్కు పాఠక మహాశయులది.

"పోనీ.. ఇంతకుముందర మీరు చదివిన కథ ఎందుకు నచ్చిందో వివరంగా చెప్పగలరా?" కాఫీ తాగుతూ వందనని అడిగాడు పాణి.

"చెప్తాను. తప్పకుండా చెప్తాను. నిజం చెప్పాలంటే, అదంతా చెప్పటానికే నే నిక్కడికి వచ్చింది." వందన నవ్వుతూ మొదలుపెట్టింది.

"హైదరాబాద్‌లో అశోక్‌నగర్ దగ్గర ఉన్న గాంధీనగర్‌లో మేము అద్దెకు ఉంటున్నాం ఓ చిన్న ఇంట్లో. ఓ చిన్న ఇల్లు అంటే నిజంగా చిన్న ఇల్లే అది. ఒకే ఒక గది, అది కూడా చాలా చిన్న గది, పక్కనే అంతకన్నా చిన్న వంటిల్లు. మా అన్నయ్య ఏదో చిన్న కంపెనీలో పనిచేస్తున్నాడు. నెలకి అయిదు వందల రూపాయల జీతం. నాకు మా అన్నయ్యా, వదినా తప్ప ఇంకెవరూ లేరు. మా అన్నయ్యకు పెళ్లయి రెండేళ్లయింది. అప్పటి నుండి నా పడక వంటింటికి మారింది. అయితే అది పెద్ద సమస్య కాదు."

"మరి ఏమిటంటారు సమస్య?"

"మా అన్నయ్య ముక్కోపి. పెళ్లయ్యే దాకా నన్ను కాల్చుకుతినేవాడు చీటికీ మాటికీ."

"పోనీలెండి.మీ అన్నయ్య పెళ్లయాకా మీకు కొంతైనా రిలీఫ్ కలిగి ఉండాలి. ఆయన గారి కోపాన్ని భరించేందుకు [illegible] వదిన వచ్చింది కదా!"

"అవును. నేను అలాగే అనుకున్నాను మొదట్లో. నేనూ మనిషినే కదా. నేనూ స్వార్థపరురాల్నే. మా అన్న మీద ఎంత ప్రేమా, గౌరవం ఉన్నా ఆ మహానుభావుడు చీటికీ మాటికీ నన్ను చివాట్లు వేస్తూంటే, నేను ఎంతకాలం భరించగలను? అందుకే మా వదిన వస్తోందంటే నాకు చాలా హాయి అనిపించింది. కానీ, ఆ తర్వాత..."

"ఏమైంది? చెప్పండి."

"మా వదిన కాపురానికి వచ్చాక మీ రన్నట్లు ఆయన గారి ధ్యాస అంతా ఆమె మీదే ఉండేది. పగలు వదిన మీద ఎన్నిసార్లు ఎంత విసుక్కున్నా సాయంకాలం ఆమె కోసం వస్తూ వస్తూ మల్లెలు, జాజులు తీసుకొచ్చేవాడు. మర్నాడు ఉదయం దాకా అందరి జీవితాలు తాపీగా, హేపీగా సాగిపోతూండేవి. నే ననుకున్నట్లు మా అన్నయ్య దగ్గర్నుంచి నాకొక విధమైన రిలీఫ్ కలిగినందుకు నేను ఎంతో సంతోషించాను. కానీ కొన్నాళ్లయ్యాక నా మీద కూడా కొంచెం చిరాకు పడ్డం మళ్లీ మొదలెట్టాడు. అయితే మా వదిన నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేసేది - ఇంటి ఆడపడుచుని ఎప్పుడూ గౌరవించాలని, ఆదరించాలని, ఆమె కంట తడిపెడితే మన ఇంటికే అరిష్టం అని ఆమె వాదించేది."

"మీ రెంతో అదృష్టవంతులు. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా స్త్రీలు తమ ఆడపడుచులను బలపరచరు!"

"నిజమే. పాణి గారూ! మా వదినమ్మ విమల నిజంగా సాధారణమైన వ్యక్తి కాదు. ఆమెకు నా మీద ఈగ వాలడం కూడా ఇష్టంలేదు. అంతేకాదండోయ్. క్రమక్రమంగా ఆమె మా అన్నయ్యని ఎదిరించడం మొదలుపెట్టింది."

పాణి ఆలోచనలో పడ్డాడు. వందన ఆ రోజు ఉదయమే తన దగ్గరకు రావడం, తన మెడలో అభినందనల మందారమాల వెయ్యడం, మనస్ఫూర్తిగా తనకు కానుక నివ్వడం, తన ఇంటి విషయాల్ను నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా తన ముందు ఉంచడం ఇవన్నీ కూడా అతని మనసులో కొత్త ఆలోచనల్ని రేకెత్తించాయి. ఈ సంఘటనలను జోడించి, అనూహ్యమైన మలుపులను పెట్టి చక్కటి కథకు రూపం కల్పిస్తే ఎలా ఉంటుందో అనే ఆలోచన వచ్చింది అతగాడికి. బహుశా రచయితలందరూ ఇంతేనేమో! ఏది విన్నా ఏది చదివినా అది తమ రచనలకు ఏ విధంగా సహాయపడ్తుంది అని ఆలోచిస్తారు.

"ఏమండోయ్, పాణి గారూ! మీరు వేరే ఏదో ధ్యాసలో పడ్డట్లున్నారు. నేను చెప్తున్నది సమంగా వింటున్నారా, లేదా?"

"అదేమిటి అలా అంటారు? ఎంతో శ్రద్ధగా వింటున్నాను మీ కథని."

"ఇంతదాకా ఈ వందన చెప్తున్నది కథ కాదు మహానుభావా.. జీవితం గురించి, నా జీవితం గురించి. కథ అని ఎలా అనుకున్నారు మీరు."

"వందనా! రచయితల దృష్టిలో జీవితానికీ, కథలకు మధ్య తేడా ఉండదు. కథ లెక్కడ్నుంచి పుట్టుకొస్తాయి? శూన్యంలోంచి అయితే రావు. జీవితమే కథలకి ఆధారం. కానివ్వండి మీ కథ."

వందన మళ్లీ మొదలు పెట్టింది. "క్రమక్రమంగా నా కర్థమైందేమిటంటే మా అన్నయ్య ముక్కోపి అయితే, మా వదిన 'నక్కోపి.'

"ఇదేమిటండీ! ముక్కోపి. అన్న మాట విన్నాం కాని నక్కోపి అన్న మాట ఎప్పుడూ వినలేదు." పాణి ఆశ్చర్యంగా అన్నాడు.

"వినకపోవడం ఏమిటండీ, పాణిగారూ? ఇప్పుడు విన్నారు కదా. ముక్కోపి కంటే కోపంలో ఓ ఆకు ఎక్కువగా చదివిన వ్యక్తిని నక్కోపి అనుకుందాం. సరే, నెమ్మదిగా మా వదినమ్మ అన్నయ్యని ప్రతీ విషయంలో ప్రతిఘటించడం, ఎదిరించడం మొదలుపెట్టింది. ఇద్దరిలోనూ ఏ విషయంలో అయినా తమ మాటే నెగ్గాలని, తమ పంతమే చెల్లాలనే ఆలోచన రోజు రోజుకూ ఎక్కువ అయ్యేది. ఫలితంగా ఇద్దరి మధ్యా చిటపట రవ్వలు రగిలేవి. వాళ్లిద్దరి మధ్యా ఉండాలంటే నాకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. కాని నేను ఇందాక చెప్పినట్లు మా వదినకి నా మీద అంతులేని అభిమానం. ఆ రోజు - నేను పొద్దున్నే లేవగానే ఎవరి మొహం చూశానో కానీ, చాలా దురదృష్టకరమైన సంఘటన జరిగింది."

"ఎవరి మొహం చూసుంటారు? బహుశా మీ అన్నయ్య మొహం చూసుంటారు. ఇంతకీ ఏమైంది ఆ రోజున?"

"మేం ముగ్గురం భోజనాలకు కూర్చున్నాం. ఆయన గారికి సెలవే కాబట్టి తీరిగ్గా మొదలుపెట్టాడు వాదం. దొండకాయ కూర బాగాలేదంటూ."

"సరే లెండి. వంకలు పెట్టకుండా తినండి. అయినా ఆ దొండకాయలు నే నేం తేలేదు. మీ పుట్టింట్లో ఉంది కదా! బోడి దొండపాదు. మీ పిన్నమ్మ పంపించింది దొండకాయలు. కాదు... కాదు.. దొండపళ్లు. అందుకే ఆ కూర ఇలా తగలడింది."

"విమలా! రోజు రోజుకీ నీ నాలుక అదుపు తప్పుతోంది. అయినా నా మొహం నీ మొహం కంటె వెయ్యి రెట్లు అందంగా ఉంది."

"ఎవడండీ మీ కలా చెప్పింది! మొహం నిండా స్ఫోటకపు మచ్చలూ, మీరూనూ. ఈ ప్రపంచంలో కెల్లా అనాకారీ, వికృత రూపీ ఎవరంటే మీ పేరు ఆలోచన లేకుండా చెప్పేస్తాను. ఈ సారి లింకా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మీ పేరు తప్పకుండా ఎక్కుతుంది లెండి" అంది ఆవిడ వ్యంగ్యంగా.

"విమలా! నీ కిదే నా ఆఖరి వార్నింగ్. ఇంకోసారి నన్ను కానీ, మా పిన్నిని కానీ ఏమన్నా అన్నావంటే నేనేం చేస్తానో నాకే తెలీదు. అయినా మగవాళ్లకి పుట్టిల్లనేది ఉండదు. పుట్టిల్లు అనే మాట మీ ఆడజాతికే వర్తిస్తుంది." ఆవేశంగా అన్నాడు మా అన్నయ్య చేతిలోంచి నీళ్ల గ్లాసు నేల మీదికి విసిరికొడుతూ.

"ఏం మగవాళ్లకి పుట్టిల్లంటూ ఉండదా? ఎవడండీ మీకు చెప్పింది? మీ రేమన్నా ఆకాశం నుండి ఊడిపడ్డారా?" కోపంతో మా వదిన అంది.

"అంతే! చెంప ఛెళ్లు మంది. మరో రెండు రోజులలో మా వదిన పుట్టింటికి చేరుకుంది."

"అంటే చిన్న విషయం గాలివాన అయిందన్న మాట. ఈచిన్న విషయం గురించి మీ అన్నా వదినమ్మ ఇంతగా వాదించుకోవడం, ఆవిడ మీద చెయ్యి చేసుకోవడం, ఆవిడ గారు పుట్టింటికి వెళ్లిపోవడం నిజంగా ఇవన్నీ తలచుకుంటున్నప్పుడు ఎంతో బాధ వేస్తుంది కదూ."


"అక్కడే మీరు పొరపాటు పడ్డారు రచయిత గారూ. చెంప ఛెళ్లు మన్నది మా అన్నయ్యది. అనిపించింది మా వదిన. ఆ తర్వాత ఆవిడ ఎంతో బాధపడింది. కానీ మా అన్నయ్య జరిగిన అవమానానికి తట్టుకోలేకపోయాడు."

"మరి ఆ తర్వాత ఏం జరిగిం దంటారు?" కుతూహలంగా అడిగాడు పాణి.

"మా వదిన వెళ్లిపోయిన కొన్ని రోజుల్లోనే నాకు గొంతులోకి అన్నం ముద్ద దిగేది కాదు. మా ఇంటి దగ్గర ఉన్న డాక్టరుకి చూపించుకున్నాను. ఏవో మాత్రలు ఇచ్చాడా డాక్టరు. కానీ, వాటి వల్ల ఫలితం లేకపోయింది. చివరికి ఒక డాక్టరు నన్ను హైదరాబాదులోని ఇఎన్‌టి హాస్పిటల్‌కి వెళ్లమన్నాడు. ఓ మంగళవారం నాడు ఆ హాస్పిటల్‌కి వెళ్లాను. అక్కడేమైనా ఆలస్యం అవుతుందేమోనని, ఎందుకైనా మంచిదని ఓ పత్రిక తీసుకెళ్లాను.

"అక్కడే అప్పుడే మీ కథ చదివాను. మీ కథలో కులాంతర వివాహాలు చేసుకున్న శకుంతలా, సుధాకర్ లిద్దరికీ కూడా వాళ్ల వాళ్ల పుట్టిళ్ల వేపు నుంచి నిరాదరణ, ఉదాసీనత ఎదుర్కోవాల్సి వచ్చిందని రాశారు. అంటే - దాని వల్ల మగవాళ్లకి కూడా పుట్టిల్లు అనేది ఒకటుందన్న మాటే కదా. ఇ.ఎన్.టి. హాస్పిటల్లో పనయిన వెంటనే పరుగు పరుగున మా అన్నయ్య దగ్గర కెళ్లి మీ కథ చూపించాను. మొదటి నుంచి చివరి దాకా ఆ కథ మా అన్నయ్య చేత చదివించాను. అది చదివాకా ...

"అప్పటికే పశ్చాత్తాపంతో బాధపడుతున్న మా అన్నయ్య మగవాళ్లకి కూడా పుట్టిల్లు ఉంటుందన్న




విషయాన్ని అంగీకరించాడు. వెళ్లి మా వదినని తిరిగి కాపురానికి తీసుకు వచ్చాడు. మా వదినమ్మ కూడా తన పంతాన్ని వదిలేసి అన్న దగ్గరికి మనస్ఫూర్తిగా తిరిగి వచ్చింది. ఇప్పుడు వాళ్ల సంసారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. ఇదండీ మీ కథ చదివాకా మా ఇంట్లో జరిగిన విషయం. మరో సారి మీకు ధన్యవాదాలు" అంటూ పాణికి నమస్కరించింది. సెలవు తీసుకునేందుకు లేవబోయింది వందన.

"ఆగండి, మరో కప్పు కాఫీ తీసుకుని వెళ్లండి" అంటూ లోపలికి వెళ్లాడు పాణి. ఇంకో అయిదు నిముషాల్లో పాణి కాఫీ కప్పుతో ప్రత్యక్ష మయ్యాడు.

"మరి మీకు?" అడిగింది వందన.

"ఫిఫ్టీ ఫిఫ్టీ తాగుదాం. ఇప్పుడేగా ఓ డోసు అయింది." నవ్వుతూ అన్నాడు పాణి.

ఆమె అక్కడే ఉన్న ఖాళీ కప్పులో సగం పోసి పాణి కిచ్చి తాగమంది. ఇంతలో అతను అంత సేపు తెరిచి ఉన్న తలుపు మూసి గడియ పెట్టి వచ్చాడు.

"ఇదేమిటి! ఇతగాడు ఇప్పుడు తలుపు మూశాడు. కొంప తీసి మనసులో దురుద్దేశం ఏమీ లేదు కదా. ఇప్పుడెలా? ఇంట్లో లోపల వేరే మనుష లెవరూ ఉన్నట్లు లేదే. ఇతడితో తను సంతోషం పంచుకునేందుకు వచ్చింది. అతడిలోని రచయితను అభినందించేందుకు వచ్చింది. కానీ, ఇప్పుడు అనవసరంగా తను చిక్కుల్లోపడడం లేదు కదా!

"ఇదేమిటి? తలుపుకు గడియ పెట్టారు అకస్మాత్తుగా?" ఆమె కంఠంలో ఆందోళన, భయం స్పష్టంగా తెలుస్తున్నాయి.

"ఎందు కేమిటి నిన్ను బంధించేందుకు. ఇంత సేపు నువ్వు మాట్లాడుతున్నావు. నీ విషయాలన్నీ చెప్పావు. ఇప్పుడు నీ పని అయిపోయఇంది. వెళ్లిపోతా నంటున్నావు. కానీ, ఇప్పుడు నీతో పనుంది నాకు. ఇంతకంటే చక్కని అవకాశం దొరకదు. దీనిని నేను వాడుకుంటాను." ఆయన గారి మాటలలో గట్టి సంకల్పం, పట్టుదల.

"ఏమిటి మీ ఉద్దేశం?" ఆమె లేచి నిల్చుని కోపంగా అడిగింది.

"వందనా! నా మనసు కొత్త చిగురు తొడుగుతూంది."

"అంటే?"

"అంటే - నువ్వు నన్ను ఇంతసేపట్నుంచి చూస్తూనే ఉన్నావు. నే నెంత లావుగా ఉన్నానో గమనించే ఉంటావు. నేను ఇన్ని సంవత్సరాలు పెళ్లి చేసుకోకపోవడానికి కారణం నేను చూసిన అమ్మాయిలందరూ సన్నగా ఉండడమే."

"సన్నబడడానికి నేను ఎన్నో ప్రయత్నాలు చేశాను. అన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ఇప్పుడు ఈ తలుపు వేయడంలో నా ఉద్దేశం ని న్నేదో చెయ్యాలని కాదు. నువ్వు నా కంటె లావుగా ఉన్నావు. నీ కభ్యంతరం లేకపోతే నిన్ను నా జీవితంలోకి ప్రవేశించమని కోరుతున్నాను" అన్నాడు పాణి.

అనుకోని ఈ స్పందనకి, ఊహించని ఈ పరిణామానికి వందనకు ఎవరో చెవిలో అమృతం పోసినట్లయింది. అవును. తనకు మాత్రం పెళ్లీడు రాలేదా? తను కూడా ఎంతో లావు. ఇంకెంత కాలం అన్న గారి ఇంట్లో ఉంటుంది!

తన సాంగత్యంలో,సాహచర్యంలో భవిష్యత్తులో పాణి రచయితగా ఎంతో ఎత్తు ఎదగాలని భగవంతుడ్ని కళ్లు మూసుకుని ప్రార్థించింది ఆమె. ●

## రచయితలూ, గమనించండి!

★ సఖ్యత, సదభిరుచి గల కథలయినా, నవలలయినా, వ్యాసాలయినా ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించితేనే వాటికి సార్థకత్వం చేకూరుతుంది అని భావించి అశేషంగా రచయితలు మాకు రచనలు పంపుతున్నారు. ఇందువలనా, కారణాంతరాలవలన పాతవి చాలా ఉండిపోయినందువలనా మేము ఎంత ప్రయత్నించినా వాటి ప్రచురణలో చాలా ఆలస్యం జరుగుతున్నది. అందుకు మా క్షమాపణలు.

★ సాధ్యమైనంత త్వరలోనే అచ్చువేయడమో, లేక తక్షణమే వెనక్కు పంపడమో చేయడానికి ప్రయత్నిస్తాము.

★ రచయితలు 'కలం' పేరుతో రాసి పంపిన వాటికి అచ్చయింతర్వాత మేము ఆ పేరుతో పారితోషికం చెక్కు పంపితే, దానిని వెనక్కు పంపి అసలు పేరుతో పంపమంటున్నారు. ఇది ఒకే పనిని రెండుసార్లు చేయడం అవుతుంది కనుక రచన అచ్చయితే పారితోషికం ఏ పేరు మీద పంపాలో స్పష్టంగా వ్రాయమని మనవి.

★ రచనలతోపాటు కార్డులు పంపడం డబ్బు దండుగ. తగిన స్టాంపులు అతికించి మీ చిరునామా రాసిన కవరు పంపండి. అంగీకరించనిపక్షంలో వెనక్కు పంపుతాము.

★ రచనఅచ్చవడానికి రెండు వారాలు ముందుగా ఆ రచయితకు కార్డు ద్వారా తెలుపుతున్నాము.

★ పారితోషికం కాని, వివిధ బహుమతుల మొత్తాలు కాని - రచన అచ్చయిన [విజేతల పేర్లు ప్రకటించిన] నాటి నుండి 12 వారాలలోగా అందకపోతే రాయండి.

★ 'మా వద్ద నవలలు /నాటకాలు, కథలు /స్క్రిప్టులు ఉన్నాయి పంపమంటారా?' అని వచ్చే ఉత్తరాలకు జవాబులు రావు అని గమనించండి.

★ రు. 50కు పైబడిన పారితోషికం చెక్ రూపంలో మాత్రమే పంపుతాము. ఈ నిబంధనకు మినహాయింపు ఉండదు.

★ వ్యాసాలు /డిజైన్లు /కార్టూన్లు /జోకులు - లాంటివి పంపినప్పుడు ప్రతి పేజి చివర, లేదా ప్రతి కార్టూన్/డిజైన్ చివర పూర్తి చిరునామా రాయండి.

★ 'పైలా పచ్చీసు' శీర్షిక కోసం 'స్వభాషితం' రాసేవారు నల్లటి సిరాతో స్పష్టంగా రాయాలి.

★ పాఠకుల పార్లమెంట్‌కు రాసేవారు వీలైనంత క్లుప్తంగా అభిప్రాయాలను వ్యక్తీకరించండి.